# తప్పనిసరి

– స్వాతి

**అందంలో అప్సర కాకపోయినా ఆకర్షణ కలిగిన అవయవసంపదతో, అణకువతో వుండే సుమన అంటే ఆఫీసులో అందరికీ అభిమానమే. బాస్ చెప్పిన పనిని చకచకా చేసేస్తూ చేరిన కొద్ది రోజుల్లోనే 'గుడ్ వర్కర్' అనే ముద్ర వేసేసుకొని బాస్‌అభినందనలు అందుకొంది. ఆఫీసు స్టాఫ్ అందరితో గలగలా మాట్లాడుస్తూ ఆత్మీయంగా మెలిగే సుమన అంటే అందరికీ మంచి ఇంప్రెషనే వుంది.**

సుమన ఆఫీసులో చేరేనాటికి మరో అమ్మాయి కూడా వుండేది. ఆ అమ్మాయి తన పని వరకే మాట్లాడేది తప్పితే కలివిడిగా మాట్లాడ్డం అదీ వుండేది కాదు. మిగిలిన స్టాఫ్ అంతా మగాళ్లే. వాళ్లు కూడా పని వుంటే మాట్లాడేవారు తప్పితే ఫ్రీగా వుండేవారు కాదు. కానీ సుమన చేరాక పరిస్థితి మొత్తం మారిపోయింది. ఆఫీసులో కూడా హడావిడి పెరిగింది. అందరినీ పేరుపేరునా పలకరించేది సుమన. సరదాగా జోక్స్ వేస్తూ నవ్వించేది. ఆమె రాకముందు నీరసంగా వుండే ఆఫీసు వాతావరణం నవ్వులతో హాయిహాయిగా మారిపోయింది. ఎప్పుడూ ఏదో ఒకదానికి ప్రతివాళ్లనీ "పార్టీ ఇవ్వండి" అని వేధించి వాళ్లచేత పార్టీలు ఏర్పాటు చేయించేది. తను కూడా యిచ్చేది. వారానికి ఒకళ్లు పార్టీ యివ్వడం, కొత్తగా ఎవరైనా చేరితే పార్టీలివ్వటం విధిగా మారింది. ఈ సంగతి బాస్‌కు కూడా తెలిసి ఓ సారి సుమనను అడిగాడు-"ఏంటమ్మా! పార్టీలు, విందులు, వినోదాలు బాస్‌లకు లేవా?" అని. బాస్ చేత కూడా పార్టీ యిప్పించిన ఘనత మాత్రం సుమనదే! సుమన అంటే ఇప్పటివరకూ పెళ్లి కాని అమ్మాయనుకుంటున్నారా? కాదండోయ్! పెళ్లయిన ఆవిడే. ఏ చీకూచింతా లేకుండా భర్త శేఖర్‌తో జీవితాన్ని అందమైన అనుభవంగా మలచుకున్న మగువ సుమన.

ఆలాంటి వారి జీవితంలో 'విధి' తన ప్రతాపాన్ని చూపించటానికి సమాయత్తమౌతోంది. అది శేఖర్ వుద్యోగరూపంలో వచ్చింది. మామూలుగా శేఖర్‌కు ఆఫీసు ఉదయం పది నుంచి సాయంకాలం ఐదు దాకా వుండేది. పగటివేళ లంచ్ టైములో యింటికొచ్చి భోంచేసి వెళ్లేవాడు. సుమనక్కూడా ఆఫీస్ దగ్గరే అవడంతో లంచ్ టైం ఒకటే కావటంతో భోజనానికి యింటికి వచ్చి వెళ్లేది. ఇద్దరూ గబగబా భోజనం కానిచ్చి వీసుంటే చిన్నచిన్న ముద్దులతో, కౌగిలింతలతో బై చెప్పుకుని ఆఫీస్‌లకు వెళ్లిపోయేవారు.


ఇప్పుడు శేఖర్ డిజిగ్నేషన్ మారటంతో ఉద్యోగంలో మార్పులొచ్చాయి. ఉద్యోగం ఒక వారం నైట్ డ్యూటీ వుంటోంది. డే డ్యూటీ అయితే ఇద్దరూ కలిసి లంచ్ చేసేసి ఆఫీసులకు పరుగెత్తేవారు. నైట్ డ్యూటీల్లోనే మొదలయింది అసలు చిక్కంతా. డే డ్యూటీ అయితే ఇద్దరూ సరదాగా గడపటానికి టైం చాలా వుండేది. నైట్ డ్యూటీకి మాత్రం ఇద్దరూ 'కలవటానికి' వీలుండేది కాదు. కొత్త జంట కాకపోయినా కోరికల వేడి, వాడి కలిగి నిండు యవ్వనంతో బుసలు కొట్టే కోడె జంట. అందుకే నైట్ డ్యూటీ వున్నన్ని రోజులూ 'అది' లేకపోవటంతో ఇద్దరికీ పిచ్చెక్కినట్లుండేది. సుమన ఆఫీస్ నుంచి ఆరు గంటలకు రాగానే శేఖర్ అదే సమయానికి నైట్ డ్యూటీకి బయలుదేరేవాడు. మళ్లీ తెల్లారిపోతుంటే వస్తాడు. అప్పుడు సుమన లేచి ఇంటి పనుల్లో పడుతుంది. గబగబా నాలుగు మెతుకులు తిని తొమ్మిదికల్లా ఆఫీస్‌కు పరుగు. మధ్యాహం సుమన భోజనానికి వచ్చేవరకూ శేఖర్ కూడా వుంటాడు. ఇద్దరూ కలిసి భోజనం చేస్తారు. ఇక అప్పుడు మొదలవుతుంది అసలు కథ!

సుమనతో 'విందు' కోసం మనసు తహతహలాడుతూ వుంటుంది. కడుపు నిండగానే 'ఆ' ఆలోచనలు మొదలవుతాయి. సుమనకూ కోరిక వున్నా ఆఫీస్‌కు టైమయిపోతుందని ఒప్పుకోదు. ఏం చేయలేక నిస్సహాయంగా వుండిపోతాడు శేఖర్.

గత రెండుమూడు నెలలుగా యిదే పరిస్థితి వుండటంతో ఇక ఇద్దరిలోనూ అభిప్రాయభేదాలు మొదలయ్యాయి. "ఒక్క పది నిమిషాలు నాకోసం వుండలేవా?" అంటాడు శేఖర్. "ఆఫీస్‌కు ఆలస్యమైతే కష్టం" అని సుమన అతని కోరికను అంగీకరించదు. దాంతో ఇద్దరూ మొహం ముడుచుకుంటారు. చిరాకు వచ్చేస్తోంది. దాంతో నైట్ డ్యూటీ అంటే చాలు ఒకరి మీద ఒకరు చిర్రుబుర్రులాడు కోవటం ప్రారంభమయింది. పోనీ ఉద్యోగం మానటం యిద్దరికీ అంత యిష్టం లేదు.

000

ఆ రోజు ఆఫీసులో పని వుందని త్వరగా వెళ్లిపోయింది సుమన. శేఖర్ కూడా రాకపోవటంతో సరిగ్గా సుమన ఆఫీసుకు వెళ్లే టైమ్‌కు గుమ్మంలో ఎదురయ్యాడు. ఇద్దరూ 'హాయ్, బాయ్' చెప్పుకోవటం తప్ప ఏం చేయలేకపోయారు. సుమన వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు శేఖర్. తనకు చాలా యిష్టమైన చీర కట్టుకొంది సుమన. వీపంతా కనిపిస్తూ ఆమె శరీరం సొంపును మరింత అందంగా చూపిస్తోంది ఆ జాకెట్. పొడవాటి జడలో



తురిమిన మల్లెలు తనను చూసి వెక్కిరిస్తున్నట్టు ఫీలయ్యాడు.

నాలుగు రోజులుగా నైట్ డ్యూటీ కారణంగా శరీరానికి తగిన 'వ్యాయామం,' మనసుకు తగిన 'వ్యాపకం' లేక అల్లల్లాడిపోతున్నాడు. అసలే చిరాగ్గా వుంది. దానికి తోడు సుమన రెచ్చగొట్టే రీతిలో వెళ్లిపోయేసరికి మరింత కుతకుతలాడిపోయాడు. ఆ చీర ఎప్పుడు కట్టుకున్నా సరే, వాళ్లిద్దరూ ఆ రోజంతా 'బిజీ!' గది దాటి బయటకు రావటానికి టైమ్ వుండదు. అలాంటిది ఈ రోజు ఆ చీరలో ఆమెతో పొందు విందు లేదనుకునేసరికి మరింత వుక్రోషం వచ్చింది. ఈ రోజు దీనికి పరిష్కారం కనుక్కొని తీరాలి అని నిర్ణయించుకున్నాడు.

సుమన ఎప్పటిలాగే భోజనానికి యింటికొచ్చింది. ఇద్దరూ మౌనంగానే భజనం ముగించారు. సుమన పలకరించబోయినా మాట్లాడలేదు శేఖర్. వంటింట్లో పని కానిచ్చి బ్యాగ్ తీసుకుంటూ "ఆఫీసుకెళ్లొస్తాను" అంటూ అటు వైపు తిరిగి పడుకున్న శేఖర్‌తో చెప్పి వెనుదిరిగింది. అంతే! ఏం జరిగిందో గ్రహించేలోపు ఆమె మంచం మీద పడటం, ఆమె మీద శేఖర్ పడటం క్షణంలో జరిగిపోయాయి. పొద్దున్నుంచీ రగిలిపోతున్న అతన్ని ఆపటం ఆమె వల్ల కాలేదు.

"ఆఫీసు..." అని ఏదో చెప్పబోతున్న ఆమెను మాట్లాడనివ్వకుండా తన పెదాలతో ఆమె పెదాల్ని బంధించి అధరామృతాన్ని జుర్రుకుంటున్నాడు. అతన్నించి విడివడటానికి ప్రయత్నించిన కొద్దీ మరింత రెచ్చిపోతున్నాడు.

అరగంట తరువాత గానీ యిద్దరూ మామూలు స్థితికి రాలేదు. తుఫాను తాకిడికి గురైన లతలా వుంది ఆమె పరిస్థితి. సుఖం తెచ్చిన సంతృప్తితో ముఖం వెలిగిపోతోంది. యుద్ధం చేసి అలసిన వీరుడిలా అతను సొలసిపోయాడు. నెమ్మదిగా అతన్ని విడిపించుకొని లేచి ఆఫీసుకు బయలుదేరింది సుమన.

ఎప్పుడూ ఆలస్యంగా రాని సుమన ఓ గంట ఆలస్యంగా వచ్చేసరికి సహజంగానే అందరూ ఆశ్చర్యపోయారు. అదీ కాక వచ్చినప్పటి నుంచీ ఆమె ఫ్రీగా వుండకుండా బిడియపడటం, ఫైల్లో తల దూర్చేయటం చేసేసరికి, యింకా ఆసక్తిగా ఆమెనే గమనించసాగారు. కొంతవరకు పరిస్థితిని వూహించుకున్నా సభ్యత గలవాళ్లు కావటం, సుమన మీద వున్న మంచి ఇంప్రెషన్ కారణంగా ముసిముసిగా నవ్వుకున్నారే తప్ప ఎవరూ వెకిలిగా ప్రవర్తించలేదు. అక్కడికీ ఆమె వైపు అదోలా చూసి పలకరింపుగా నవ్వుతూ లేడీ కొలీగ్ అడిగింది-"ఏంటీ, మీ వారు నైట్ డ్యూటీ చేసి యింట్లోనే వున్నట్లున్నారు!"

ఆమెకేం సమాధానం చెప్పాలో సుమనకు తెలియలేదు.

ఇంతలో బాస్ వచ్చి "ఇందాక నిన్ను చాలాసార్లు పిలిచాను. రాలేదు. ఏం లేట్‌గా వచ్చావ్?" అన్నాడు.

కంగారు పడిపోతూ సుమన "మా వారికి నైట్ డ్యూటీ అండీ. ఇంట్లోనే వున్నారు. అందుకని..." అనేసరికి స్టాఫంతా ఒక్కసారిగా గొల్లుమని నవ్వారు. అప్పటికి కాని తనేం అన్నదో సుమనకు అర్థం కాలేదు. ఆ తరువాత ఎప్పుడు సుమన ఆలస్యంగా వచ్చినా కారణం ఎవ్వరూ అడగలేదు. భర్తకు నైట్ డ్యూటీ వున్నప్పుడల్లా సుమన ఆలస్యంగా రావటం ఆనవాయితీ అయింది.

